## గురుకులంలో ఏసీబీ అధికారుల తనిఖీలు



గురుకుల పాఠశాలలో తనిఖీలు చేస్తున్న ఏసీబీ అధికారులు

కారేపల్లి, ఆగస్టు 13 : రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం గాంధీపురంలోని తెలంగాణ గిరిజన బాలుర గురుకుల పాఠశాలను ఏసీబీ అధికారులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఖమ్మం ఏసీబీ డీఎస్పీ వై.రమేశ్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది.. పాఠశాల నిర్వహణ రికార్డులు, తరగతి గదులు, మరుగుదొడ్లు, వసతి గృహంలోని గదులు, విద్యార్థులకు అందించే ఆహారం, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను నిశితంగా పరిశీలించారు. తనిఖీల పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు డీఎస్పీ తెలిపారు.

## సీఎం రేవంత్ పర్యటనను అడ్డుకుంటాం..

### ఖమ్మం నగరంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన



నిరసన ప్రదర్శన చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు, కార్యకర్తలు

ఖమ్మం ఎడ్యుకేషన్, ఆగస్టు 13 : అపరిష్కృతంగా ఉన్న విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం, యూనివర్సిటీ డిమాండ్, విన్నపం కోసం జిల్లాకు వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి అపాయింట్‌మెంట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలో మంగళవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. నగరంలోని ఏఆర్ఎస్ కళాశాల నుంచి చర్చి కాంపౌండ్ వరకు నినాదాలు చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం విద్యార్థి, యువజన సంఘ నాయకులకు సీఎంను కలిసే అవకాశం ఇవ్వాలని, లేదంటే వందలాది మంది విద్యార్థులతో కలిసి సీఎం పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగూరి వెంకటేశ్, జాటోత్ ప్రేమ్‌సింగ్, సురేశ్, లక్ష్మణ్, శ్రీను, సంధ్య, ప్రియాంక, అనూష తదితరులు పాల్గొన్నారు.


# చుట్టుముట్టిన జ్వరాలు



అశ్వారావుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ఒక్కో బెడ్‌పై ఇద్దరు చొప్పున చికిత్స పొందుతున్న రోగులు

- ఉమ్మడి జిల్లాలో డెంగీ, వైరల్, సీజనల్ జ్వరాల విజృంభణ
- ఆసుపత్రులు కిటకిట.. అమాంతం పెరిగిన రోగుల తాకిడి..
- అశ్వారావుపేట, పెనుబల్లిల్లో ఒక్కో బెడ్‌పై ఇద్దరు రోగులు..
- గ్రామాల్లో పడకేసిన పారిశుధ్యం.. వ్యాధులకు కారణం..
- వైద్యశాలల్లో సౌకర్యాల లేమి.. వైద్యుల కొరత తీవ్రం..
- ఖమ్మంలో 348 డెంగీ కేసులే జ్వరాల తీవ్రతకు నిదర్శనం

ఖమ్మం, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉమ్మడి ఖమ్మం జిల్లాను జ్వరాలు చుట్టుముడుతున్నాయి. సీజనల్ వ్యాధులతో పాటు ప్రధానంగా డెంగీ జ్వరాలతో జిల్లా ప్రజలు అల్లాడుతున్నారు. ప్రతి గ్రామంలోనూ జ్వరాలు విజృంభిస్తున్నా ప్రభుత్వ వైద్యశాలల్లో అందుకు తగిన సదుపాయాలు అందుబాటులో ఉండడం లేదు. దీంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పేదలు ప్రైవేటు ఆసుపత్రులను కూడా ఆశ్రయిస్తున్నారు. ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లలేని వారు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే చికిత్స పొందుతున్నారు. కొన్ని గ్రామాల్లో డెంగీ, చికున్‌గున్యా జ్వరపీడితుల సంఖ్య ఎక్కువగా ఉంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఆసుపత్రుల్లోని బెడ్లు ఏమాత్రమూ సరిపోవడం లేదు. అశ్వారావుపేట, పెనుబల్లి ప్రాంతాల్లో ఒక్కో బెడ్‌పై ఇద్దరు చొప్పున చికిత్స పొందుతున్నారు. చాలా ఆసుపత్రుల్లో పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందడం లేదు. వైద్యులు, ఇతర సిబ్బంది కొరత కారణంగా రోగులకు సరైన వైద్యం అందడం లేదు. పలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు ఇవ్వడం లేదు. రోగులే బయట కొనుగోలు చేస్తున్నారు. మధిర ప్రభుత్వాసుపత్రిలో సీరియస్ కేసులను, రక్త నమూనాలను జిల్లా కేంద్రంలోని ఖమ్మం ఆసుపత్రికి పంపుతున్నారు. చివరికి బూర్గంపహాడ్ ఆసుపత్రికి వచ్చిన మృతదేహాలను కూడా ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న భద్రాచలం ఏరియా ఆసుపత్రికి పంపిస్తున్నారు.



ఆసుపత్రిలో నీరసించి బల్లపై పడుకున్న రోగి

### ఖమ్మంలో 348 డెంగీ కేసులు..

ఖమ్మం జిల్లాలో డెంగీ కేసులు అధికంగా నమోదవుతున్నాయి. అధికారిక లెక్కల ప్రకారమే జిల్లాలో 14,740 మంది నుంచి వైద్య అధికారులు శాంపిల్స్‌ను సేకరించగా.. వారిలో 348 మందికి డెంగీ ఉన్నట్లు నిర్ధారణ అయింది. జిల్లాలో డెంగీ జ్వరాల విజృంభణ ఏస్థాయిలో ఉందో ఈ గణాంకాలే స్పష్టం చేస్తున్నాయి. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో పారిశుధ్యం పడకేయడంతో దోమలు అమాంతం వ్యాప్తి చెందాయి. ఫలితంగా జ్వరాలు విజృంభిస్తున్నాయి. అయినా ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు. చివరికి ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాల కల్పనపై కూడా దృష్టి పెట్టలేదంటే పరిస్థితి ఎంతలా ఉందో అర్థం చేసుకోవచ్చు. దీంతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేరుతున్న రోగుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. అడుగడుగునా అపరిశుభ్రత తాండవిస్తోంది. జ్వర పీడితులు అధికంగా వస్తున్నారు.




ఖమ్మం ప్రభుత్వాసుపత్రిలో ఓపీ కోసం క్యూ కట్టిన రోగులు



ఖమ్మం ప్రధాన ఆసుపత్రిలో నిరీక్షిస్తున్న రోగుల సహాయకులు

## పెనుబల్లి ఆసుపత్రి నిండా రోగులే..



అశ్వారావుపేటలో..

పెనుబల్లి, ఆగస్టు 13 : మండలంలోని వివిధ గ్రామాల్లో ఇటీవల సీజనల్ వ్యాధులు విజృంభించడంతో పెనుబల్లి ఆసుపత్రికి రోగుల సంఖ్య ఒక్కసారిగా పెరిగింది. రోజుకు 150 నుంచి 200 మంది వరకూ ఔట్ పేషెంట్లు వస్తున్నారు. ఇన్ పేషెంట్లకు ఆసుపత్రిలోని బెడ్లు సరిపోవడం లేదు. దీంతో ఒక్కో బెడ్‌పై ఇద్దరు చొప్పున జ్వర పీడితులు చికిత్స పొందుతున్నారు. బెడ్లు ఖాళీగా లేని కారణంగా చాలా మంది రోగులు, జ్వర పీడితులు సాయంత్రం వరకూ చికిత్స పొంది రాత్రికి ఇళ్లకు వెళ్తున్నారు. జ్వర తీవ్రత అధికంగా ఉన్న వారు మళ్లీ ఉదయాన్నే ఆసుపత్రికి వస్తున్నారు. ఒకవేళ బెడ్ ఖాళీ అయితే దానిపై చికిత్స పొందుతున్నారు. మరికొందరు రోగులైతే ఆసుపత్రిలోని బల్లలపై కూడా పడుకొని చికిత్స చేయించుకుంటున్నారు. ప్లేట్‌లెట్స్ తక్కువగా ఉన్న రోగులను ఇక్కడి వైద్యులు ఖమ్మం పంపిస్తున్నారు. డెంగీ, టైఫాయిడ్ జ్వరాల కేసులు కూడా నమోదవుతున్నాయి.



పెనుబల్లి: ఓపీ వద్ద కిక్కిరిసిన రోగులు

## ‘పేట’లో ఒక్కో బెడ్‌పై ఇద్దరికి చికిత్స..



గదులు లేక చెట్టు కిందనే ఓపీ రాస్తున్న వైద్య సిబ్బంది

అశ్వారావుపేట టౌన్, ఆగస్టు 13 : జ్వరాల విజృంభణ కారణంగా అశ్వారావుపేట సామాజిక ఆరోగ్యం కేంద్రంలో దయనీయ దృశ్యాలు కన్పిస్తున్నాయి. ఒక్కో ఇద్దరిని పడుకోబెట్టి చికిత్స అందిస్తున్నారు. మిగిలిన వారు ఆసుప్రతి ఆవరణలోని బల్లలపైనే పడుకొని ట్రీట్‌మెంట్ పొందుతున్నారు. ఇటీవలి జ్వరాల కారణంగా ఈ ఆసుపత్రి జ్వరపీడితులతో కిటకిటలాడుతోంది. ఈ ఆసుపత్రిలో 30 బెడ్లు ఉన్నప్పటికీ అందులో కేవలం 15 బెడ్లు మాత్రమే అందుబాటులోకి ఉన్నాయి. మిగిలిన 10 బెడ్లు ప్రసూతి సేవలకు, మరో 5 బెడ్లు డయాల్సిస్ సేవలకు వినియోగిస్తున్నారు. ఈ ఆసుపత్రికి నిత్యం 200 మంది ఔట్ పేషెంట్లు వస్తున్నారు. ఇందులో 50 మంది జ్వర పీడితులే ఉంటున్నారు. బెడ్లు ఖాళీ లేని కారణంగా ఇంకా చాలామంది రోగులు రోజూ ఇంటి నుంచి వచ్చి వెళ్తూ చికిత్స పొందుతున్నారు. కాగా, గడిచిన మూడు నెలల కాలంలో ఈ ఆసుపత్రిలో 40 మలేరియా కేసులు నమోదయ్యాయి. ఇందులో ఒకరు మృతిచెందారు. ఈ మండలంలోని అశ్వారావుపేట, గుమ్మడివల్లి ఆరోగ్య కేంద్రాల్లో ఇటీవల టైఫాయిడ్, వైరల్ ఫీవర్ రోగులే అధిక సంఖ్యలో వస్తున్నారు. దీనికి తోడు ఈ ఆసుపత్రిలో సిబ్బంది కొరత వేధిస్తోంది. 12 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం ఐదుగురు మాత్రమే సేవలందిస్తున్నారు. 12 మంది నర్సింగ్ ఆఫీసర్లకుగాను నలుగురు మాత్రమే ఉన్నారు. వీరిలో ఒకరు జ్వరంతో సెలవులో ఉన్నారు. ఉన్న ఐదుగురు డాక్టర్లలో ఇద్దరు 24 గంటల చొప్పున 15 రోజులపాటు నిర్విరామంగా విధుల్లో ఉండాల్సిన పరిస్థితి.



అశ్వారావుపేటలో..

## సత్తుపల్లిలో తీవ్రంగా వైద్యుల కొరత..



రోగులతో కిటకిటలాడుతున్న సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రి

సత్తుపల్లి టౌన్, ఆగస్టు 13 : సత్తుపల్లి ఆసుపత్రికి వచ్చే రోగుల్లో సింహభాగం జ్వర పీడితులే ఉంటున్నారు. ఇంతకు ముందు వరకూ 300 వరకూ ఉండే ఔట్ పేషెంట్ల సంఖ్య ఇప్పుడు జ్వరాల సీజన్ కారణంగా 400కు చేరింది. 30 బెడ్ల సామర్థ్యం ఉన్న ఈ ఆసుపత్రిలో వాటికి సరిపడా రోగులు ఇన్ పేషెంట్లుగా నమోదవుతున్నారు. కానీ ఇక్కడ వైద్యుల సమస్య ప్రధానంగా వేధిస్తోంది. 59 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా కేవలం 10 మంది మాత్రమే విధుల్లో ఉన్నారు. సర్కారు వైద్య రంగానికి పెద్దపీట వేసిన గత కేసీఆర్ ప్రభుత్వం గతంలోనే కోట్లాది రూపాయలతో సత్తుపల్లిలో వంద బెడ్ల ఆసుప్రతిని నిర్మించింది. కానీ ఎనిమిది నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దానిని ఇంకా ప్రారంభించలేదు. దీనికితోడు వైద్యుల కొరత కూడా ఉండడంతో రోగుల తాకిడికి అనుగుణంగా వైద్య సేవలు అందడం లేదు.

## నేలకొండపల్లిలో 110 మంది ఇన్ పేషెంట్లు..



నేలకొండపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు

కూసుమంచి (నేలకొండపల్లి), ఆగస్టు 13 : నేలకొండపల్లి 30 బెడ్ల ఆసుపత్రి కూడా జ్వర పీడితులతో కిటకిటలాడుతోంది. సోమవారం సుమారు 500 మందికిపైగా జ్వరంతో బాధపడుతూ ఆసుపత్రి వచ్చారు. వారిలో 110 మందికి తీవ్ర జ్వరం ఉండడంతో వైద్యులు వారిని ఇన్ పేషెంట్లుగా నమోదు చేసుకున్నారు. వెనువెంటనే సెలైన్లు పెట్టి ట్రీట్‌మెంట్ ప్రారంభించారు. వారిలో కొందరికి మందులు ఇచ్చి సాయంత్రానికి ఇంటికి పంపించారు. మధ్యాహ్నం 3 గంటల వరకు 390 మంది ఔట్ పేషెంట్లు నమోదయ్యారు. రాత్రి షిఫ్టు వరకూ మరో 150 మంది వరకు వచ్చే అవకాశం ఉందని వైద్యులు చెప్పారు. ఈ ఆసుపత్రిలో కేవలం 30 బెడ్లు మాత్రమే ఉండడంతో జ్వరం తీవ్రత అధికంగా ఉన్న వారికి మాత్రమే బెడ్లు కేటాయిస్తున్నారు.

## విలీన మండలాల రోగులూ బూర్గంపహాడ్‌కే..



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు

సారపాక, ఆగస్టు 13 : సీజనల్ వ్యాధులతోపాటు జ్వరాలు విజృంభించిన వేళ బూర్గంపహాడ్ ఆసుపత్రికి రోగుల తాకిడి పెరుగుతోంది. ఈ మండలంలోని రోగులేగాక పొరుగున్న ములకలపల్లి, ఏపీలో విలీనమైన కుక్కునూరు, వేలేరుపాడు మండలాల రోగులు కూడా వైద్య సేవల కోసం ఈ ఆసుపత్రికే వస్తున్నారు. 30 బెడ్లు ఉన్నప్పటికీ రోగులకు సంఖ్యకు అవి సరిపోవడం లేదు. కేవలం ఔట్ పేషెంట్లే రోజుకు సుమారు 200 మంది వరకూ వస్తున్నారంటే రోగులు, జ్వర పీడితుల తాడికి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. రోగుల సంఖ్య అధికంగా ఉండే ఈ ఆసుపత్రి భవనం శిథిలావస్థలో ఉంది. నూతన ఆసుపత్రి నిర్మాణానికి గత కేసీఆర్ ప్రభుత్వం రూ.2.70 కోట్లు మంజూరు చేసినప్పటికీ కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దానిపై దృష్టి పెట్టడం లేదు. ఇక ఈ ఆసుపత్రిలో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. మరుగుదొడ్లు, మంచినీళ్ల వంటి కనీస సౌకర్యాలు లేవు. 20 రోజుల క్రితం పోస్టుమార్టం గది స్లాబ్ ఊడి వైద్యుడిపై తలపై పడింది. ఆ శవాల గది కూడా కూలిపోయే దశలో ఉంది. ఇక్కడికి వచ్చిన మృతదేహాలను స్థానిక వైద్యులు ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న భద్రాచలం ఏరియా ఆసుపత్రికి పంపిస్తున్నారు.



శిథిలావస్థలో బూర్గంపహాడ్ ఆసుపత్రి భవనం

## మధిరలో రోజుకు 300 మంది ఔట్ పేషెంట్లు..



ఒకే గదిలో ఔట్ పేషెంట్లను పరీక్షిస్తున్న వైద్యులు

మధిర, ఆగస్టు 13 : మధిర ఆసుపత్రికి కూడా జ్వర పీడితుల తాకిడి తీవ్రంగానే ఉంది. ఇటీవల జ్వరాల తీవ్రత పెరిగిన నేపథ్యంలో రోజుకు 250 నుంచి 300 మంది వరకూ ఔట్ పేషెంట్లు వస్తున్నారు. 25 నుంచి 30 మంది వరకూ ఇన్‌పేషెంట్లు నమోదవుతున్నారు. ఆసుపత్రి భవనం కూడా శిథిలావస్థలో ఉంది. నలుగురు వైద్యులు, 27 మంది నర్సింగ్ సిబ్బంది సేవలందిస్తున్నారు. సివిల్ సర్జన్ ఉన్నప్పటికీ ఆపరేషన్ థియేటర్ లేకపోవడంతో రోగులకు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేస్తున్నారు. ఇటీవల రక్త పరీక్షలు నిర్వహించే బిల్డింగ్ పెచ్చులు ఊడి పడిపోవడంతో ప్రస్తుతం ఒక రేకుల షెడ్‌లో రక్త నమూనాలు సేకరించి ఖమ్మం టీ హబ్‌కు పంపిస్తున్నారు. ఒక్క గదిలోనే వైద్యులు రోగులకు పరీక్షలు చేస్తున్నారు. కాగా, ఇటీవల తెలంగాణ ప్రభుత్వం మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో వంద బెడ్ల ఆసుపత్రికి శంకుస్థాపన చేసి నిర్మాణాలు పూర్తిచేసిన విషయం విదితమే. కానీ ప్రారంభించలేదు. తీవ్రమైన సౌకర్యాల కొరత ఉన్న పాత ఆసుపత్రిలోనే ప్రస్తుతం వైద్య సేవలు అందిస్తున్నారు.

## ‘సీతారామ’ పూర్తికి రూ.10 వేల కోట్లు కావాలి..

- ఆ ప్రాజెక్టు కోసం బీఆర్ఎస్ చేసింది చెప్పడానికి అభ్యంతరం లేదు
- ఈ నెల 15న సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగునీరు విడుదల
- విలేకరుల సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): సీతారామ ప్రాజెక్టును సంపూర్ణంగా పూర్తి చేసేందుకు మరో రూ.10 వేల కోట్లు, ఐదేళ్ల సమయం కావాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత కేసీఆర్ ప్రభుత్వం వెచ్చించిన రూ.8 వేల కోట్లతో పూర్తయిన పనులతో లింక్ కెనాల్ ద్వారా రైతులకు సాగునీరు అందించేందుకు ఈ నెల 15న సీఎం రేవంత్ రెడ్డి ద్వారా ప్రారంభోత్సవ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటికే పంపుహౌస్‌లు, పైపులైన్ల నిర్మాణం పూర్తి కాగా.. రైతాంగం ఆలోచనలతో ఏకీభవిస్తూ నీటి విడుదలకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే సీతారామ ప్రాజెక్టుకు బీజం పడిందన్నారు. సీతారామ ప్రాజెక్టుపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలు తనను బాధించాయని అన్నారు. అయితే, బీఆర్ఎస్ చేసిన పనిని తాము చెప్పుకుంటున్నట్లు జరుగుతున్న ప్రచారంలో ఎంతమాత్రమూ నిజం లేదని వ్యాఖ్యానించారు.

### సంకుచిత మనస్కుడిని కాదు..

సత్తుపల్లి ప్రాంతానికి తక్షణమే సాగునీరు అందించేందుకు అవకాశం కలిగినందునే ఉపయోగించాం తప్ప తనకు ఒక ప్రాంతం పట్ల ప్రేమ, మరో నియోజకవర్గం పట్ల చిన్నచూపు లేదని, తాను అంతసంకుచిత మనస్కుడిని కాదని తుమ్మల స్పష్టం చేశారు. తనపై జరుగుతున్న విష ప్రచారం బాధిస్తోందంటూ ఆయన విలేకరుల సమావేశంలో భావోద్వేగానికి గురయ్యారు. సీతారామ ప్రాజెక్టు కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం ఏం చేసిందో, ఎన్ని నిధులు ఇచ్చిందో ఈనెల 15న వైరాలో సీఎం సమక్షంలో జరిగే బహిరంగ సభలో తాను చెప్పడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. ఇప్పటివరకు రూ.30 వేల కోట్ల మేర రుణమాఫీ కావాల్సి ఉండగా.. కేవలం రూ.18 వేల కోట్లు మాత్రమే అయిందని వివరించారు. ఈ నెల 15న వైరాలో జరిగే సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.2 లక్షలలోపు రుణమాఫీని అధికారికంగా ప్రకటిస్తారని, రూ.2 లక్షలకు పైగా రుణం తీసుకున్న రైతుల రుణం సైతం మాఫీ కావాల్సిన అవసరం ఉందని అన్నారు. సీతారామ ప్రాజెక్టు నీటిని ఇల్లెందు ప్రాంతానికి సైతం అందించాల్సి ఉందని, లలితాపురం చెరువు ద్వారా రోళ్లపాడుకు, రోళ్లపాడు నుంచి బయ్యారానికి సీతారామ నీళ్లు అందించాల్సిన ఆవశ్యకత తను ప్రభుత్వానికి తెలియజేసినట్లు చెప్పారు. భవిష్యత్‌లో ఈ పనులు ప్రారంభమవుతాయన్నారు. విలేకరుల సమావేశంలో కేఎంసీ మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్ కమర్తపు మురళి తదితరులు పాల్గొన్నారు.

## 16న భద్రగిరిలో సామూహిక కుంకుమార్చన


బూర్గంపహాడ్, ఆగస్టు 13 : శ్రావణమాసం సందర్భంగా భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఈ నెల 16న వరలక్ష్మీ వ్రతం రోజు బేడా మండపం వద్ద సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు సామూహిక సహస్రనామ కుంకుమార్చన నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన భక్తులు పూజలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. అలాగే 15వ తేదీ నుంచి 19వ తేదీ వరకు పవిత్రోత్సవాలు ఉంటాయని, ఈ క్రమంలో ఆయా తేదీల్లో నిత్య కల్యాణాలు రద్దు చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

### 30న పుష్పాంజలి సేవ

దేవస్థానంలో శ్రావణమాసంలో భాగంగా నాల్గవ శుక్రవారం(30న) సాయంత్రం 4 గంటలకు శ్రీలక్ష్మీతాయారమ్మవారికి పుష్పాంజలి సేవ నిర్వహించనున్నట్లు ఈవో రమాదేవి తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

## రేషన్ బియ్యం రాలే..

- ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి బియ్యం చేర్చాలని డీలర్ల డిమాండ్
- ఈ నెల 15వ తేదీ వస్తున్నా ఇంకా షాపులకు చేరని బియ్యం
- దుకాణాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్న కార్డుదారులు
- అధికారులు పట్టించుకోకపోవడంతో విసుగెత్తి ధర్నాకు దిగిన డీలర్లు



ఖమ్మం అర్బన్ ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద ధర్నా చేస్తున్న రేషన్ డీలర్లు

రఘునాథపాలెం, ఆగస్టు 13 : గడువు ముగుస్తున్నా రేషన్ బియ్యం దుకాణాలకు ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి సరఫరా కాకపోవడంతో డీలర్లు నిరసనకు దిగారు. నిబంధనల ప్రకారం ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్ షాపుల ద్వారా కార్డుదారులకు బియ్యం పంపిణీ జరుగుతుండగా.. రెండు నెలలుగా బియ్యం సకాలంలో రాకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లావ్యాప్తంగా 150 రేషన్ షాపులకు పైగా బియ్యం సరఫరా చేయకపోవడంతో జిల్లా రేషన్ డీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డీలర్లు ఖమ్మం అర్బన్, ఖమ్మం రూరల్ ఎంఎల్ఎస్ పాయింట్ల ఎదుట మంగళవారం బైఠాయించారు. బియ్యం పంపిణీ విషయంలో సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో గుత్తేదారు ఆడిందే ఆటగా సాగుతోందని మండిపడ్డారు. ఉద్దేశపూర్వకంగానే ఒకటి రెండు లారీల లోడ్లు మాత్రమే ఎంఎల్ఎస్ పాయింట్లకు తీసుకరావడం.. వచ్చిన లోడ్లను ఒకరిద్దరు డీలర్లకు సరఫరా చేస్తున్నారని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకన్న ఆరోపించారు. బియ్యం కోసం నిత్యం డీలర్లు ఎంఎల్ఎస్ పాయింట్లకు వెళ్లడం.. అక్కడి ఇన్‌చార్జి లోడ్లు రాలేదని చెబుతుండడంతో చేసేది లేక ఇంటిబాట పడుతున్నారు. ఇదంతా నిత్యకృత్యంగా మారడంతో విసుగెత్తిన డీలర్లు మంగళవారం గోదాం వద్దకు వచ్చిన రెండు లోడ్ల బియ్యం సరఫరా జరగకుండా అడ్డుకున్నారు. అనంతరం డీలర్లందరూ ఐక్యమై ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద బైఠాయించి ధర్నా చేశారు. ధర్నాలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ జానీమియా, ఖమ్మం నగర కమిటీ అధ్యక్షుడు ఇబ్రహీం, మహేశ్, పాపారావు, బాబు, మురళీ, ఖాజామియా, గాజుల భద్రయ్య, జానీమియా పాల్గొన్నారు.

### నిత్యం కార్డుదారుల ప్రదక్షిణలు

నిబంధనల ప్రకారం ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్ షాపుల ద్వారా కార్డుదారులకు బియ్యం పంపిణీ చేస్తారు. ఒకటో తేదీన ఈ–పాస్ మిషన్ ద్వారా ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభం కావడంతో డీలర్లు నిత్యం అందుబాటులో ఉండి వినియోగదారులకు బియ్యం అందజేస్తారు. అంటే.. అంతకు ముందుగానే రేషన్ షాపులకు బియ్యం సరఫరా జరిగితే ఒకటో తేదీ నుంచి లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేపట్టడం సాధ్యమవుతుంది. కానీ.. రేషన్ షాపులకే ఏ రోజుకు బియ్యం వస్తాయో తెలియకపోవడంతో డీలర్లు సైతం కార్డుదారులకు సరైన సమాధానం చెప్పలేకపోతున్నారు. దీంతో కార్డుదారులు రేషన్ షాపుల చుట్టూ ప్రదక్షిణలు చేయడమే పనిగా పెట్టుకుంటున్నారు. ఈ క్రమంలో పలువురు కార్డుదారులు బియ్యం కూడా తీసుకోవడం లేదు.

### ఈ నెల పోర్టబిలిటీ సరఫరా లేనట్టేనా?

రేషన్ దుకాణాలకు చేరాల్సిన జనరల్ కోటా మంగళవారం నాటికి కూడా చేరకపోవడంతో పోర్టబిలిటీ బియ్యం రేషన్ షాపులకు చేరేనా? అనే అనుమానాన్ని రేషన్ డీలర్లు వ్యక్తం చేస్తున్నారు. వన్ నేషన్–వన్ రేషన్ విధానం ద్వారా కార్డుదారుడు ఏ రేషన్ దుకాణంలోనైనా బియ్యం తీసుకోవచ్చు. ఏ జిల్లాకు చెందిన వారు వచ్చినా కార్డు నెంబరు ఆధారంగా డీలర్లు బియ్యం పంపిణీ చేస్తున్నారు. అయితే ఆ రేషన్ షాపు పరిధిలోని అసలు వినియోగదారులు నష్టపోకూడదనే ఉద్దేశంతో పోర్టబిలిటీ రిక్వెస్ట్ ప్రక్రియను తీసుకొచ్చారు. దీని ద్వారా సదరు రేషన్ డీలర్లు ఆ షాపు పరిధిలో మిగిలి ఉన్న కార్డుదారుల అవసరం మేరకు పోర్టబిలిటీ రిక్వెస్ట్ పెట్టి.. కావాల్సిన బియ్యం షాపులకు చేరవేయాలని కోరుతారు. వచ్చిన బియ్యాన్ని గడువులోగా అందుబాటులో ఉండి పంపిణీ చేస్తారు. అయితే జిల్లావ్యాప్తంగా అనేక రేషన్ షాపులకు బియ్యం చేరకపోవడంతో ఇక పోర్టబిలిటీ రిక్వెస్ట్ పరిస్థితి ఏమిటని డీలర్లు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి త్వరితగతిన బియ్యం షాపులకు చేరేలా చర్యలు తీసుకోవాలని, కార్డుదారుల నుంచి ఎదురయ్యే ఇబ్బందులను తొలగించాలని డీలర్లు వేడుకుంటున్నారు.